

కథ 2011
8

# ఇప్పమొగ్గలు

## మల్లిపురం జగదీశ్

వెన్నెల ముద్దల్లా, వెలుగు పువ్వుల్లా... చుక్కలాకాశం ఆ చెట్టు క్రింద పరుచుకున్నట్టు. వృద్ధ ఆదివాసీ దేహంలా ఆకురాల్చిన ఇప్పచెట్టు. ఆ వెనుక పోడు మంటల్లో మండీ మండీ నలుపు రంగులోకి తిరిగిన కొండ.

రాలిన మొగ్గల్ని ఏరుతోంది భూదేవి. మొగ్గలేరుతుందన్న మాటేగానీ ఆమెలో ఏదో అసహనం. బుధవారం పుట్టిందని 'బూదీ' అని పేరు పెట్టేరు. బడిలో ఆ పేరు 'భూదేవి'గా మారిపోయింది. గూడలో మాత్రం ఇప్పటికీ 'బూదీ' అనే పిలుస్తుంటారామెని.

'హృదయం ఎక్కడున్నాదీ...

హృదయం ఎక్కడున్నాదీ...

నీ చుట్టూనే తిరుగుతున్నాదీ...' సిగ్నల్ చెట్టు నుండి రింగ్‌టోన్ వినబడింది. మొగ్గలేరడం ఆపి, ఆ చెట్టు కొమ్మకి వేలాడదీసిన మొబైల్ అందుకొని చూసింది. హోటల్ మేనేజర్. ఓకే చెయ్యాలా వద్దా అని ఆలోచిస్తూనే చివరి నిమిషంలో గ్రీన్ బటన్ నొక్కింది.

"హలో బూదేవీ! బూదేవీ!"

"... ... ..."

"వస్తున్నావా? చూడు మరి, నువు రాకపోతే... నీ బదులు ఎవర్నో..." సిగ్నల్ అందలేదేమో, ఫోన్ కట్ అయ్యింది.

ఎండ ముదురుతోంది. దూరంగా జీలుగుచెట్టుకి కట్టిన కల్లుబిడ్డీ దించుతున్నా రెవరో. వేడెక్కుతున్న గాలి మొగ్గల పరిమళంతో అడివంతా వ్యాపిస్తోంది తియ్యగా... మత్తుగా.

ఒక్కొక్క మొగ్గా, ఒక్కొక్క జ్ఞాపకంలా ఏరుకుంటోంది బూది.

*

"మనం చెప్పేది స్పష్టంగా వుండాలి. ఎదుటివాళ్లకి సులభంగా అర్థమవ్వాలి. మోడ్రన్‌గా వుండాలి. డ్రెస్ కోడ్ తప్పనిసరి. షేక్‌హేండ్ చేసేటప్పుడు కాస్త ముందుకి వంగి నిలబడాలి. చిరునవ్వు ఎప్పుడూ చెరిగిపోకూడదు. హుందాగా కనబడడంలోనే మన సక్సెస్ సీక్రెట్ దాగి వుంటుంది..." పర్సనాలిటి డెవలప్‌మెంట్ క్లాసులోని లెక్చరది.

గిరిజన విద్యార్థుల కోసం ఐ.టి.డి.ఎ. కొన్ని కార్పొరేట్ సంస్థలతో కలిసి సంయుక్తంగా శిక్షణనిస్తోంది. హోటల్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఫేషన్ డిజైనింగ్‌లాంటి కోర్సులు నిర్వహించింది.

ఆ ప్రారంభసభలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి మాట్లాడేరు.

'మారుతున్న కాలంతో పాటు గిరిజనులూ మారాలి. సభ్య సమాజంలో కలిసి నడవాలి. పోటీపడాలి. అభివృద్ధి సాధించాల'ని చెప్పేరు. ఆయా సంస్థల ప్రతినిధులు అధికార్లకు పుష్పగుచ్ఛాలిచ్చి సన్మానం చేసేరు. ఆ దృశ్యం చూస్తుంటే, 'అభివృద్ధి ఎవరిదో, అది ఎంత సులువో కదా' అనిపిస్తుంది.

అందరిలాగే బూది కూడా చేరింది. ఆమెకి పి.ఓ. గారి మాటలే పదేపదే వినపడుతున్నాయి. అమ్మాయిలూ, అబ్బాయిలూ కలిసి సుమారు రెండు వందల మంది వుంటారు. వాళ్లనక్కడ చూస్తుంటే కొండమీది చెట్లను తెచ్చి నగరంలోనాటి నీళ్లు చిలకరిస్తున్నట్టుంది.

ఉరుకుల పరుగుల నగరం. దాని వేగం దానిదే.

సాయంత్రమైతే చాలు, దారి తప్పోయిన మేకపిల్లల్లాగ, అర్థరాత్రి చీకట్లో వేటగాడి టార్చిలైటుకి అల్లకల్లో

లమైపోయిన కుందేలు కూనల్లాగ అడివిపిల్లలు అల్లల్లాడిపోయేరు. వయసు అడిగే సందేహాలు... నగరం నేర్పిన కొత్త అలవాట్లు... చదువు నేర్పిన కొత్త అవసరాలు... హాస్టల్లో వున్నన్నాళ్లూ రాని డబ్బుల అవసరం ఇప్పుడు అత్యవసరం అయ్యింది. పెరట్లోని పనస కాయలో... కొండమీది కందిగింజలో, చీపుళ్లో... చింత పండో సంతకి దిగి పాకెట్ మనీగా మారుతున్నా డబ్బు అవసరం ఇంకా ఎక్కువవుతూనే వుంది.

ట్రైనింగ్ చివరిరోజు...

"ఈ రోజు మీరంతా ప్రొఫెషనల్స్. గవర్నమెంటే కాదు, ప్రైవేటు కంపెనీల్లో కూడా మీకు ఆఫర్లొస్తాయి. త్వరలో మీకు కాల్‌లెటర్స్ వస్తాయి. ఈలోగా మన ఎంప్లాయ్‌మెంట్ సెల్లో ఈ డిప్లమోని రిజిష్టర్ చేసుకోండి," అంటూ ఒక్కొక్కరినీ స్టేజి పైకి పిలిచి సర్టిఫికేట్స్ అందించేరు. దీనితోనైనా వుద్యోగం వస్తే మొదటి జీతంతో అమ్మకి చీర, చెప్పులు కొనాలని అనుకుంది బూది. ధగధగల విద్యుత్ వెలుగుల్లో ఆ కార్పొరేట్ సంస్థల పేర్లు మెరుస్తుండగా ఆ ఫంక్షన్ గ్రాండ్‌గా ముగిసింది.

మరుసటిరోజే బూది ఐ.టి.డి.ఎ. ఆఫీసుకి వెళ్లింది. విశాలమైన భవంతిలో ఒక చిన్న గది, ఎంప్లాయిమెంట్ సెల్. బూది మెట్లెక్కుతోంది. ఆమె చేతిలోని హోటల్ మేనేజ్‌మెంట్ డిప్లమో సర్టిఫికెట్ పాలిథీన్ కవర్లో మిలమిలా మెరుస్తోంది.

ఆ ఆఫీసంటే ఆమెకి భయం. అంతకుమించి ఎవరిమీదో తెలియని కోపం. అక్కడికి ఎప్పుడొచ్చినా ఆ చేదు జ్ఞాపకాలు వెంటాడుతూనే వుంటాయి. ఆ జ్ఞాపకాలు ఆమె అక్క జ్యోతి గురించినవే.

బూది బాల్యమంతా అక్క భుజాల మీదే గడిచింది. పొలాలు, కొండలు, తుప్పలు, డొంకలు... అన్నీ ఎత్తుకొని తిప్పేది. గెడ్డలో చేపలు పట్టి చేతిలో పెట్టేది. మారాం చేస్తే 'కంగరోడొస్తాడ'ని భయం చెప్పి గోరు ముద్దలు తినిపించేది. బూది హాస్టల్లో చేరేనాటికి జ్యోతి హైస్కూలు చదువు పూర్తయ్యి రెండేళ్లయ్యింది. ఉన్నట్టుండి ఓ రోజు జ్యోతి బేగ్ సర్దుకుంటుంటే ఎప్పటిలాగే ఏడుపందుకుంది బూది. ఎత్తుకొని ముద్దులాడింది జ్యోతి. "ఒచ్చేస్తాను... బేగి పారొస్తాన్లే, నీకు బోల్డన్ని బిస్కత్తులు, బిల్లలు తెస్తానూ... ఏడకా!?" అంటూ వెళ్లిపోయింది.

ఆ రోజు జ్యోతి బయల్దేరుతుంటే తల్లి కళ్లలోని భయం బూదికి ఇప్పటికీ గుర్తే. ఆ తర్వాత్తర్వాత బూదికి తెలిసొచ్చింది జ్యోతక్క ఐటీడిఎ ద్వారా ఏయెన్నెమ్ ట్రైనింగ్‌కి వెళ్లిపోయిందని, ఆ యేడాదే కొత్తగా వచ్చిన పి.ఓ.గారు గిరిజన యువతకి ఉద్యోగావకాశాలు కల్పించడానికి బుక్ బైండింగ్, టైలరింగ్, ఫ్రూట్ జ్యూస్ మేకింగ్, టైప్‌రైటింగ్, బనియన్ల తయారీలో ఉచిత శిక్షణనిచ్చేరని.

జ్యోతి వున్నన్నాళ్లూ కళకళలాడే ఇల్లు, తాను వెళ్లిపోవడంతో వెలవెలబోయింది. మట్టిగోడల మీద అంబలితో అంటించిన సినిమా బొమ్మలు మాట్లాడ్డం మానేశాయి. నల్లమెరుగు మట్టితో సేమాకు పెట్టిన గోడలపై ఎర్రని జేగురురంగులు, తెల్లసుద్ద ముగ్గులు కళ తప్పిపోయాయి.

ఒకరోజు సాయంత్రం ఇంటి ముందు మోటార్ బైక్ ఆగింది. ముంజూరు కింద నించి బయటకి చూసింది జ్యోతి తల్లి. ఎర్రటి పొడుగాటి వ్యక్తి బైక్ దిగేడు. చేతినిండా వుంగరాలు, మెడలో బంగారు గొలుసు, వెనక జ్యోతి దిగింది. తల్లి పలకరించింది. కాళ్లు కడుక్కోమని చెంబుతో నీళ్లిచ్చింది. అతడు కూర్చున్నాడు అసహనంగా పరిసరాల్ని గమనిస్తూ. వంటగదిలోకి వెళ్లి 'ఎవరు?' అన్నట్టు చూసింది తల్లి. జ్యోతి తలవంచుకుంది. అనుకున్నదంతా అయ్యిందన్నట్టు గతుక్కుమంది... గాలి ఆగిపోయినట్టు, చీకట్లో సిందవకి ఎదురైపోయినట్టు.

"ఉద్యోగమొచ్చిందమ్మా," అని రూపాయి నోట్లు పెట్టింది. మాట్లాడ్డానికేమీ లేనట్టుండిపోయారిద్దరూ. కొద్ది క్షణాల భయంకర నిశ్శబ్దం తర్వాత అతను బైక్ స్టార్ట్ చేసేడు. వెనుక జ్యోతి కూర్చుంది. బూది ఏడుపందుకుంది. బండి ఎక్కుతానని, అక్కతో వెళ్తానని.

రేగిన దుమ్ము, ధూళిలో బైక్ వెనక పరుగులు పెడుతుంటే తల్లి తనని వెనక్కిలాగడం బూదికి ఇప్పటికీ గుర్తే. మోటారుబైకు శబ్దం గాలిలో తేలి క్రమంగా దూరమైపోయింది. అంతదాకా మండిన పొయ్యి ఆరిపోయింది. పొయ్యి మీద దాకలో కొర్ర బియ్యం మాడిన వాసన, ఇల్లంతా కమ్ముకున్న పొగ.

టౌను వార్తలు అప్పుడప్పుడూ ఆ నోటా ఈ నోటా వినపడుతూ వుండేవి. ఐటీడిఎలో బనియన్ ఫాక్టరీల కోసం, పళ్లరసం తయారీ కేంద్రాలకోసం కొత్తకొత్త భవనాలు కట్టించేరు. పగోడాలు... పర్ణశాలలు, రకరకాల పేర్లతో... రకరకాల రూపాల్లో. అవి ఊపిరాడని పగోడాలు... 'చీకటి నింపుకున్న రహస్య నిర్మాణాల'ని తర్వాత తెలిసొచ్చింది. బనియన్ల తయారీలో చీకటి కత్తెరకి చిక్కి చీలికపేలికలైన గుడ్డముక్కలయ్యేరు కొండ

పిల్లలు కొందరు. పళ్ల రసం తయారీలో రసం పిండిన పిప్పిలా తయారయ్యేరు మరికొందరు.

ఆ ట్రైనింగులు పూర్తయ్యేసరికి పి.ఓ.గారికి బదిలీ అయ్యింది. కొత్త పి.ఓ.గారు వచ్చారు. ఆయన వేరే పథకాలు రచించేరు. దారి తప్పిన మేకలు ఇంటికి చేరేయి. తిండిలేక కొన్ని, అంతుచిక్కని రోగాలతో చిక్కి శల్యమై మరికొన్ని.

జ్యోతి పరిస్థితి కూడా బాగోలేదని తెలిసింది. అతనితో తగువులవుతున్నాయని.

ఒకరోజు కబురొచ్చింది టౌను నుంచి. జ్యోతికి బాగులేదని. భయం భయంగానే జ్యోతి తల్లి బయల్దేరింది బూదిని వెంటపెట్టుకొని. తోడుగా వూరి జనం. ఐటీడీఏకి వెళ్తే, 'ఇక్కడ కాదు పెద్దాసుపత్రిలో,' అన్నారు.

అందరిలోనూ ఆతృత... భయం... ఏదో అనుమానం. ఆసుపత్రిలో చివరి గదికి తీసుకువెళ్లేరు. కొద్ది మంది గుమిగూడి వున్నారక్కడ. ఒక్కొక్కరూ తప్పుకుంటూ దారిచ్చేరు. గుండె దడదడలాడుతుంటే వెళ్లి చూసింది. కప్పి వున్న గుడ్డని తప్పించేరెవరో. ఈత చాపలో నిర్జీవంగా జ్యోతి.

ఒక్కసారిగా ఏడుపులు, పెడబొబ్బలు.

''మంచిపిల్ల. వాడి మాయలో పడిపోయింది. వాడి కాంట్రాక్ట్ పనుల కోసం పిల్లని వాడుకున్నాడు. ఎన్నాళ్లని భరించగలదు? మనసు చంపుకోలేక... ప్చ్...!'' ఎవరో బాధని వ్యక్తం చేసేరు.

ఎక్కువసేపు ఏడవనివ్వకుండా ఏవో కాగితాలపై తల్లి వేలిముద్రలు తీసుకుని అంత్యక్రియల కోసం వెయ్యి రూపాయలు చేతిలో పెట్టేరు.

భూదేవి భారంగా నిట్టూర్చింది. మెట్లు ఎక్కుతుంటే గాలి బలంగా తాకింది. చేతిలో సర్టిఫికేట్ జారి క్రింద పడింది.

'అమ్మీ బూదీ! ఎల్లొద్దే, ఎల్లొద్దే,' అని వెనక నుంచి జ్యోతక్క పిలుస్తున్నట్టనిపించింది. మనసు రాయి చేసుకుంది. అడుగు ముందుకేసింది.

''పేరు?''

''భూదేవి''

''ఇంటి పేరు?''

''ఆరిక''

''ఏ వూరు?''

ఎంప్లాయిమెంట్ క్లర్క్ అప్లికేషన్ నింపుతున్నాడు. అతని చూపులు ఎక్కడెక్కడో పారాడుతున్నాయి. రాయవలసిన బయోడేటాతోపాటు అతనికి కావలసిన సమాచారమూ రాబడుతున్నాడు. మాటామాటా కలుపుతున్నాడు.

''ఎ మోల్ ఆన్ దీ...'' అంటూ ఓరగా చూసేడు.

గతుక్కుమంది భూదేవి.

అతని చేతిలో టెన్త్ సర్టిఫికేట్ వుంది.

భూదేవి కోపంగా చూసింది అతని వైపు.

''ఇక్కడ సంతకం పెట్టు,'' అంటూ కాగితాలు ముందుకి తోసేడు.

సంతకం చేస్తుంటే అన్నాడు... ''అందమైన అమ్మాయి కన్నెర్రజేసినా అందమే,'' అని.

కిటికిలో నుంచి వచ్చే గాలి తరగల్లో... అక్క... అదృశ్యంగా... వెళ్లిపొమ్మని హెచ్చరిస్తున్నట్టే వుంది.

ఆ యేడాదే కాల్‌లెటర్ వచ్చింది. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు వాళ్లకి ప్లేస్‌మెంట్ ఇస్తున్నాం రమ్మని. వెళ్లేక తెలిసింది ప్లేస్‌మెంట్స్ ఇస్తున్నది అమ్మాయిలకే గాని అబ్బాయిలకు కాదని. టౌన్లో ఎవరో కొత్తగా హోటల్ లాంచ్ చేస్తున్నారని, మిగతా వాటికంటే భిన్నంగా, కొత్తగా వుండాలని, బిజినెస్ బాగా జరగాలని ట్రైనింగ్ పొందిన పదిమంది అమ్మాయిలను సెలక్షన్స్ కోసం పిలిపించేరు.

మీటింగ్ హాల్లో కూర్చున్నారంతా. క్రింద మెత్తని తివాచీ, వొంటిని తాకుతున్న చల్లని గాలి. ఎదురుగా 'సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ' అని ఆకుపచ్చని అక్షరాలతో విశాలమైన బోర్డు. దాని క్రింద 'పథక నిర్వహణాధికారి' అని నేమ్ ప్లేట్ వున్న టేబిల్.

వెనుక నుంచి తలుపు తీసిన చప్పుడైంది. అందరూ లేచి నిలబడ్డారు.

''కూర్చోండి... కూర్చోండి,'' అంటూ ఓ వ్యక్తి లోపలికొస్తూ, ''పి.ఓ.గారు అర్జెంట్‌గా కేంప్ వెళ్లాల్సి వచ్చింది,'' అని అందరివైపు చూసి నవ్వేరు. భూదేవి దగ్గర ఆగేయి అతని చూపులు.

''ఏం పేర్రా నీ పేరు?'' దగ్గరికొస్తూ అడిగేడు.

చెప్పింది.

''వెరీగుడ్... ఏ ఊరు... ఎక్కడ చదివేవు?'' అంటూ సాగదీసేడు.

భూదేవి వెనక్కి జరిగింది.

''మీకిది గొప్ప అవకాశం. వినియోగించుకోవాలి,'' అంటూ ప్రక్కకొచ్చి కూర్చున్నాడు. లేచి నిలబడబోయింది భూదేవి. ''ఆఁ... ఆఁ... కూర్చో,'' అంటూ భుజాలు పట్టుకొని కూర్చోబెట్టేడు.

ఒంటిమీద రోకలిబండ పాకినట్లైంది. అతనొక జిల్లాస్థాయి అధికారని అతని మాటల్లో అర్థమయ్యింది.

''మీలాంటి ఆడపిల్లలు కొండల్లో వుండిపోకూడదు. చదువుకోవాలి. వుద్యోగాలు చెయ్యాలి. భయ

పడగూడదు. ధైర్యంగా ముందడుగు వెయ్యాలి,'' అతను చెప్పుకుపోతున్నడు. మధ్యమధ్యలో చేతులు ఆమెపైన వేస్తూనే వున్నాడు. భయపడాల్సింది ఎవరి నుంచో అర్థమయ్యింది భూదేవికి.

''విష్యూ ఆల్ ది బెస్ట్,'' అని చేయి ముందుకు చాపేడు. పాము పడగను పట్టుకున్నట్టు ఒళ్లు జలదరించింది అతని షేక్‌హేండ్‌కి.

తలుపు తోసి బయటికొస్తే వేడిగాలి ముఖానికి తాకింది. ఆ గాలిలోంచి అస్పష్టంగా... 'అమ్మా బూదీ... ఎల్లొద్దే... ఒద్దే... దే,' అని అక్క జ్యోతి లీలగా అరుస్తున్నట్టే అనిపించింది.

బయట వరండానిండా జనం. కొండల నుండీ... మారుమూల గిరిజన గ్రామాల నుండీ... ఒక్కొక్కరూ ఒక్కొక్క సమస్యలా. తమని తాము ఒక వినతిపత్రంలా మలచుకొని సాయం కోసం, పి.ఓ.గారి రాక కోసం. ఐటీడీఏ ఆవరణలో చెట్ల క్రింద, సిమెంట్ బెంచీల మీద... గిరి జనం.

''భ్బ మతి పోతుందిరా బాబు...''

''మన ఆఫీసు పావనమైపోయిందిరా ఈ వేళ. ఈళ్ల దగ్గర ఏ హీరోయిన్ పనికొస్తాదిరా?''

''హీరోయిన్లకైతే మేకప్పెయ్యాల్రా...''

ఆ మాటలన్నీ తన గురించేనని అర్థమవుతూనే వుంది భూదేవికి. ఆవైపు తిరిగి చూసింది. అతను ఎంప్లాయిమెంట్ గుమాస్తా.

''అయినా ట్రైబుల్లోను ఇంత అందమైనోళ్లున్నారంతే ఆచ్చరమేస్తాదిరా.''

''ఓరి పిచ్చోడా, అందంగా వున్నారంతే వుండరా మరి?''

''అంటే?''

''బ్రీడో... హైబ్రీడు. ఆ రోజుల్లో ఏజెన్సీని పల్లపోలు ఒక తిన్నగ వుంచారేటి? షావుకార్లు, సొండీలు, పోలీసులు... ఆళ లోన యిదీ...''

'ఛీ... వీళ్లు మనుషులేనా? అడవిని నమ్ముకొని కొండల్లోనూ, గూడేల్లోనూ నివసిస్తున్న తమ వాళ్ల పట్ల ఇంతటి నీచభావమా? ఎవరైనా కొత్త వ్యక్తి ఇంటికొస్తే ఆదరించడం... పండో, కాయో, మామిడితాండ్ర చుట్టో ఇచ్చి నేస్తరికం చెయ్యడం... కొండఫలంలోని కొంత నేస్తానికివ్వడం తమ సాంప్రదాయం. అతిథుల్ని గౌరవించడం, వాళ్లని నమ్మడం తమ సంస్కారం.

'మరి వీళ్లు...?

'నలుగురితో నడవడానికి నగరానికొస్తే... అడుగడుగునా అవమానం. సందు దొరికితే ఆక్రమించుకోవడం. తోటి మనిషి పుట్టుక గురించి హీనంగా మాట్లాడే వీళ్లు నాగరీకులా? ఇంత దిగజారి నీచంగా మాట్లాడిన వీళ్లు ఆధునికులా?'

'సెప్పేనా?... నా మాటిను... ఎనక్కొచ్చీయే బూదీ...' ఒద్దనుకున్నా అక్క మాటలు వినిపిస్తూనే వున్నాయి. అడుగడుగునా జ్యోతి కనిపిస్తూనే వుంది. అయినా అడుగు ముందుకేసింది. అవసరం తనది.

'హోటల్ రాకేష్.'

రంగురంగుల విద్యుద్దీపాలు, అద్దాల గదులు. ఏసీ గాలులు. బ్లాక్ అండ్ వైట్ షార్ట్ మోడల్ యూనీఫాంలో కష్టమర్ల నుంచి ఆర్డరు తీసుకోవడం. ఐటెమ్స్ సర్వ్ చెయ్యడం. బిల్ చేయించి మర్యాదపూర్వకంగా కష్టమర్స్‌ని శాటిస్‌ఫైడ్‌గా పంపించడం. ఎంత మర్యాదగా అంటే సర్వ్ చేస్తూ టేబిల్‌పైకి వంగినప్పుడు కష్టమర్స్ ఎలాంటి చూపులు ఎక్కడెక్కడ చూసినా, ఎలాంటి వెకిలి వేషాలేసినా భరించేంతగా.

రెండు పూటలా భోజనం హోటల్‌లోనే అయిపోతుంది. రాత్రి డ్యూటీ ముగిసేసరికి పది దాటిపోతుంది. ఆ టైమ్‌లో రూమ్‌కి వెళ్లడం ప్రతీరోజూ సాహసమే. దానికి తోడు కుళ్లు జోకులేస్తూ... ఆ టైమ్ దాకా వదలని మేనేజర్. అప్పుడప్పుడూ 'నీకోసం' అంటూ పెర్‌ఫ్యూమ్‌లు, గాజులులాంటి గిఫ్ట్‌ తెస్తూ వుంటాడు. ఏ రోజైనా తీసుకోదా అన్నట్టు.

రోజూలాగే... ఆ రాత్రి పది దాటింది. కష్టమర్లు 'యిక రారు' అని నిర్ధారించుకున్నాక ఒక్కొక్కరూ భోజనం చేసి రూమ్‌కి వెళ్లిపోతున్న సమయంలో, ''నువ్వుండు, నీతో పనుంది,'' అన్నాడు మేనేజర్.

''ఏమిటి సార్?'' అడిగింది భూదేవి.

''కలిసి భోంచేద్దాం,'' అన్నాడు.

ఒకే టేబిల్‌పై ఎదురెదురుగా కూర్చున్నారు. కొంతసేపు మౌనం తర్వాత అన్నాడు... ''మన హోటల్‌కి ఇంపార్టెంట్ గెస్ట్స్ వస్తున్నారు రిసీవ్ చేసుకోవాలి.''

''ఇప్పుడా?'' అంది వాచ్ వైపు చూస్తూ.

''ఔను... ఇప్పుడే... రెడీ అవు,'' అని ప్లేటులో చేతులు కడుక్కొని లోపలికి వెళ్లేడు.

కాసేపటికి ఓ ఫ్లవర్ బొకేతో తిరిగివచ్చేడు.

''అదేంటి నువ్విలాగే వున్నావా?'' అని బొకే అందించాడు. ''లైట్ తీస్కో... ఏం భయంలేదు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవడంలోనే వుంది ఎదుగుదల రహస్యం. అర్థంచేసుకో. తెల్లవారి ఎర్లీ అవర్స్‌లో వెళ్లిపోదువుగాని,'' అని ముగించాడు.

ఆ మాట విన్నాకగాని అర్థంకాలేదు అతనేం చెప్తున్నాడో...

కోపంగా చూసింది అతనివైపు.

నవ్వుతూ అన్నాడతను... "లాస్ అవుతావ్... ఆపర్చునిటీస్..."

కోపంతో ఆమె ముఖం ఎర్రబడింది.

"క్విక్... క్విక్... భూదేవి," బొకే చేతికి అందించి చేయిపట్టి లేపుతూ తొందర చేయబోయాడు.

అంతే. ఒక్కసారిగా బరస్ట్ అయింది. బొకేని అతని చేతుల్లోకి బలంగా విసిరి, "సారీ సర్, ఆ అవకాశం ఏదో కోరుకున్నవారికి ఇవ్వండి," అని రివ్వున బయటి కొచ్చింది.

ఏడుస్తూ పరుగు పరుగున రూమ్‌కి చేరుకుంది భూదేవి. చీకట్లో తలగడలో మొహం దాచుకొని వెక్కి వెక్కి ఏడుస్తోంది. అమ్మ గుర్తొచ్చింది. పదేళ్ల క్రితం ఫేనుకి వురేసుకున్న జ్యోతక్క గుర్తొచ్చింది.

జరిగిన విషయం బయటకి తెలిస్తే ఏమౌతుంది? అక్కడున్నవాళ్లందరూ ఒక్కటైపోయి తిరిగి ఆ అమ్మాయే మీద పడిందని ఋజువు చేయగలరు. అది తెలియంది కాదు. ఎదురు తిరగలేదు. అలాగని ఆ హింసని భరించ లేదు.

ఫ్రెండ్స్ అందరూ ఒక్కొక్కరూ ఒక్కోలా ఓదార్చేరు.

"ఇలాంటి చిన్నచిన్న విషయాలు పట్టించు కోకూడదు. అయినా ఏటి జరిగింది? ఏటీ అవలేదు కదా?" అంది స్వాతి.

ఆ మాట చివుక్కున తగిలింది. కోపంగా చూసింది. అదెప్పుడూ అంతే. ఇరవై నాలుగు గంటలూ ఫోన్లోనే గడుపుతూ వుంటుంది. అందరితో కలిసి వుండదు. ఇద్దరో ముగ్గురో బాయ్‌ఫ్రెండ్స్ వున్నారట దానికి. ఒక్కొక్కరోజు టిప్‌తోపాటు ఒక లెటర్ కూడా అందుకుంటుంది. ఆ రాత్రి రూమ్‌కి రాదు. అందుకే అదంటే అసహ్యం భూదేవికి.

"చూడు భూదేవీ! పన్నెండొందలతో ఈ టౌన్లో బతకడమంటే చాలా కష్టం. చిన్నచిన్న అవసరాలు తీరా లంటే ఇలాంటివి తప్పవు," అని అద్దంలో ముఖం చూసుకుంటుండగా ఆమె ఫోన్ రింగ్ అయ్యింది. "ఆఁ... వస్తున్నా..." అంటూ చీకట్లోకి నడిచింది.

ఆ చీకటి తనకి అంటకముందే భూదేవి లగేజి సర్దుకుంది.

*

ఎండ ముదురుతున్న కొద్దీ ఇప్పమొగ్గల వాసన మత్తెక్కిస్తోంది. చింతగీరు అలాగే గీ పెడుతోంది. దూరంగా ఎవరో కర్రలు కొడుతున్న శబ్దం. ప్రక్కనే కొండల మీంచి పల్లానికి పరుగులు తీస్తున్న గెడ్డ. దిగువున ఐ.టీ.డీ.ఎ కట్టించిన చెక్‌డామ్... శిథిలావస్థలో. దాని మీద నీరందక చేను ఎండిన పొలం. పొలం గట్టు దిగువున దారి... గెడ్డకి దిగుతూ.

మొగ్గల గంపని తలకెత్తుకుంది భూదేవి. గెడ్డ వైపు అడుగులేసింది భారంగా. నాగరికతకు దూరంగా... కొండల మధ్య తన వూరు, వూళ్లోని నేస్తాలు... ఒక్కొ రొక్కరుగా గుర్తొచ్చేరు. గంగ ఇంటర్ చదివి టీచర య్యింది. కానీ టౌన్లో... ఒకడి చేతిలో మోసపోయి బిడ్డతో ఒంటరిగా బ్రతుకుతోంది. రాధిక? కాలేజీ చదువు మధ్యలో ఆపేసి అన్నల్తో కలిసి అడవుల్లోకి వెళ్లిపో యింది. బ్రతికుందో లేదో కూడా తెలీదు.

వీళ్లలో చదువుకోనిదెవరు? చదువేం నేర్పింది? ఈ చదువుల్తో ఎవరు మాత్రం సుఖంగా వున్నారు? ప్రశ్నల మీద ప్రశ్నలు. తామంతా మొగ్గలుగా వున్నప్పుడు అందాల్సిందేదో అందలేదో, అందుకోలేకపోవడమో... జరిగి వుంటుంది.

కాలికేదో తగిలింది అడ్డంగా. తన్నుకొని ముందుకు తూలబోయింది. క్రిందికి చూసింది. కుడి కాలి బొటనవేలి నుంచి రక్తం చిమ్ముతోంది.

"ఇదొకటి దారికడ్డంగా," అని గంప దించింది. 'ఈ రోజెలాగైనా తీసి జల్లీయాల,' అని మట్టిలో పాతుకు పోయిన దాన్ని తవ్వి తీసింది. ఐ.టీ.డీ.ఎ నిర్మించిన చెక్‌డామ్ తాలూకు శిలాఫలకం అది. దాన్ని తీసి గెడ్డలోకి విసిరేసింది. ఎగువన గెడ్డలో కేరింతలు వినపడ్డాయి. వూరి పిల్లలు. బడి మొఖం ఎరుగని పసిమొగ్గలు.

"ఈ మొగ్గల్ని పువ్వులుగా చేసి రేపటి సమాజానికి అందించగలిగితే?"

"అక్కా! రా... నువ్వు మల్లారా," అని పిల్లలు గెంతులేస్తూ... దిస మొలల్లో.

"ఆఁ... వస్తున్నాన్రా" అని నవ్వి అటు అడుగులు వేసింది భూదేవి.

*పాలపిట్ట మాసపత్రిక, ఆగస్టు 2011*

